Digital, tmedia.net.in

# టీ-మీడియా

సంపుటి : 8
సంచిక : 307
పేజీలు : 3
గురువారం 11.06.2026

మెయిన్ ఎడిషన్

సామాజికం.. ప్రజల పక్షం...

GSTIN: 36FDKPS1308P1ZX | Analytics ID: UA-194163459
Domain ID : DC7812B9B3101414BB98847D724E48B3A-IN

ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ

## అత్యధిక కాలం ప్రధానిగా మోదీ..

### -ప్రశంసలు కురిపిస్తూ కేంద్ర క్యాబినెట్ తీర్మానం



**టీ మీడియా, జూన్ 10 న్యూఢిల్లీ:** అత్యధిక కాలం ఎన్నికైన ప్రధానిగా మోదీ కొత్త రికార్డు క్రియేట్ చేశారు. గతంలో నెహ్రూ పేరిట ఉన్న రికార్డును ఆయన బ్రేక్ చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర క్యాబినెట్ ఇవాళ ప్రత్యేకంగా సమావేశమైంది. అత్యధిక రోజులు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన మోదీని ప్రశంసిస్తూ కేంద్ర క్యాబినెట్ ఇవాళ తీర్మానం పాస్ చేసింది. క్యాబినెట్లో ఉన్న మంత్రులు అందరూ ఆ మీటింగ్లో పాల్గొన్నారు. మోదీపై ప్రశంసలు కురిపిస్తూ కేంద్ర మంత్రి రాజ్నాథ్ ప్రకటన చేశారు. ఆ తర్వాత మంత్రులందరూ లేచి నిలబడి చప్పట్లు కొట్టారు. 2014 మే 26వ తేదీన దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ప్రధానిగా పోటీ చేసిన ఆయన ఘన విజయం సాధించారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లోనూ భారీ మెజారిటీతో ప్రధాని పీఠాన్ని చేజిక్కించుకున్నారు. ఆ ఏడాది మే 30వ తేదీన ఆయన మళ్లీ ప్రధాని బాధ్యతలు చేపట్టారు. ఇక మూడోసారి కూడా ప్రధానిగా 2024 జూన్ 9వ తేదీన మోదీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో మాజీ ప్రధాని జవహర్లాల్ నెహ్రూ 4398 రోజుల పాటు బ్రేక్ లేకుండా ప్రధానిగా చేశారు. ఇప్పుడు ఆ రికార్డును మోదీ అధిగమించారు. నేటితో 4399 రోజుల పాటు ప్రధానిగా బాధ్యతలు నిర్వర్తించిన వ్యక్తిగా మోదీ ఘనత సాధించారు.

# అమరావతికి కేంద్ర ప్రభుత్వ కీలక ప్రాజెక్టులు





- **రూ.2,534 కోట్లతో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం**
- **కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ కోసం రూ.1,299.08 కోట్ల కు ఆమోదం**

**టీ మీడియా, జూన్ 10 ,అమరావతి బ్యూరో :** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి కేంద్ర ప్రభుత్వం కీలక ప్రాజెక్టులు ప్రకటించింది. సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి సంబంధించి సీపీడబ్ల్యూడీ ప్రతిపాదనలకు కేంద్ర కేబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. దీంతో అమరావతిలో రూ.2,534 కోట్లతో సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణానికి రంగం సిద్ధమైంది. ఇందులో భాగంగా కామన్ సెంట్రల్ సెక్రటేరియట్ కోసం రూ.1,299.08 కోట్లు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల నివాస సముదాయాలకు రూ.1,234.91 కోట్లు వెచ్చించనుంది.

### మల్టీస్టోరేజ్ నివాసాలు

కామన్ సెంట్రల్ సెక్రటేరియట్లో కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు కొలువుదీరనున్నాయి. అమరావతి కేంద్రంగా పని చేసే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు మల్టీస్టోరేజ్ నివాసాలు ఏర్పాటు చేయనున్నారు. సెంట్రల్ సెక్రటేరియట్ నిర్మాణం కోసం ఇప్పటికే సీఆర్డీఏ 22.53 ఎకరాలు కేటాయించింది. ఇందులో 5.53 ఎకరాల్లో సెక్రటేరియట్, 17 ఎకరాల్లో నివాస సముదాయం నిర్మాణం చేపట్టనున్నారు.

### చంద్రబాబు కృతజ్ఞతలు?

అమరావతిలో సెంట్రల్ గవర్నమెంట్ జనరల్ పూల్ ఆఫీస్ అకామిడేషన్ - ప్రాజెక్టుకు ఆమోదం తెలిపిన కేంద్ర కేబినెట్కు సీఎం చంద్రబాబు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఏపీలో కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉనికిని బలోపేతం చేయడానికి, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని మెరుగుపరచి పౌరులకు మరింత సమర్థవంతంగా సేవలను అందించడానికి ఈ కీలక నిర్ణయం ఎంతగానో దోహదపడుతుందన్నారు. అమరావతి రాజధాని అభివృద్ధికి, భవిష్యత్తు వృద్ధికి అవసరమైన పరిపాలనా మౌలిక సదుపాయాలను కల్పించడంలో ఈ ప్రాజెక్ట్ ఒక ప్రధాన మైలురాయిగా నిలుస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలన్నింటినీ ఒకే చోటికి తేవడం ద్వారా పాలన సులభతరం అవుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్ర దీర్ఘకాలిక అభివృద్ధి ఆకాంక్షలకు గణనీయమైన సహకారాన్ని ఇది అందిస్తుందన్నారు. ఆధునిక, పర్యావరణహిత కేంద్ర ప్రభుత్వ భవనాల నిర్మాణానికి లభించిన ఈ ఆమోదం అమరావతి అభివృద్ధిలో మరొక ముఖ్యమైన ఘట్టమన్నారు. రాష్ట్రంలో ప్రపంచస్థాయి పబ్లిక్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ను నిర్మించడంలో కేంద్రం అందిస్తున్న నిరంతర మద్దతుకు ఇది నిదర్శనమని కొనియాడారు.

### భవనాల ఖర్చు పూర్తిగా కేంద్రానిదే

కేంద్రమంత్రి పెమ్మసాని అమరావతికి వచ్చే ప్రాజెక్టులపై మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన అమరావతి ప్రాజెక్టులపై ప్రధానికి సానుకూల దృక్పథం ఉందని చెప్పారు. అమరావతికి వచ్చే ఈ ప్రాజెక్టులను శుభశకునంగా భావిస్తున్నామన్నారు. ఏపీకి ఉపాధిహామీ నిధుల కింద రూ.7,700 కోట్లు ఇచ్చారని తెలిపారు. దేశంలోనే ఎక్కువ నిధులు దక్కించుకున్న 3వ రాష్ట్రంగా ఏపీ నిలిచిందని హర్షం వ్యక్తం చేశారు. తక్కువ జనాభా ఉన్నా కొన్ని కారణాల వల్ల ఎక్కువ నిధులు దక్కాయని ఆయన అన్నారు. అమరావతిలో కేంద్ర ప్రభుత్వ భవనాల పూర్తికి మూడేళ్లు పట్టవచ్చున్నారు. భూమి ఒక్కటే రాష్ట్రం ఇచ్చిందని, భవనాల ఖర్చు పూర్తిగా కేంద్రానిదేనని పెమ్మసాని పేర్కొన్నారు.

### ఎంతో కష్టపడితేనే వచ్చాయి

టైర్-2, టైర్3 కింద వివిధ రకాల భవనాలను కేంద్రం నిర్మిస్తుందని, అమరావతి బిల్లు, సెంట్రల్ సెక్రటేరియట్, ఔటర్ రింగ్రోడ్ కీలకమని వెల్లడించారు. సీఎం చంద్రబాబుతో కలిసి ఈ 3 కీలక నిర్ణయాలు తీసుకున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం కట్టే కాంప్లెక్సులు అధునాతన భవనాలు ఇవన్నీ రాత్రికి రాత్రి రాలేదని, ఎంతో కష్టపడితేనే వచ్చాయని పెమ్మసాని తెలియజేశారు.

## మీనాక్షి కేసులో నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి..



- **ఈసీని కోరిన సీనియర్ కాంగ్రెస్ నేతలు**

**టీ మీడియా, జూన్ 10, న్యూఢిల్లీ:** మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ అభ్యర్థిగా కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, ఏఐసీసీ తెలంగాణ దూత మీనాక్షి నటరాజన్ వేసిన నామినేషన్ తిరస్కరణకు గురైన విషయం తెలిసిందే. ఈ అంశంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు ఇవాళ కేంద్ర ఎన్నికల సంఘంతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్తో పాటు అభ్యర్థి మీనాక్షి నటరాజన్.. బుధవారం ఈసీఐ అధికారుల్ని కలిశారు. ఆ బృందంలో అభిషేక్ సింఘ్వీ, జైరాం రమేశ్, భూపేశ్ భగల్, దీపా దాస్మున్సీ, రణదీప్ సుర్జేవాలా ఉన్నారు. మీనాక్షి నటరాజన్పై కోర్టు కేసు ఉన్న కారణంగా ఆమె రాజ్యసభ నామినేషన్ పిటీషన్ను తిరస్కరిస్తున్నట్లు రిటర్నింగ్ అధికారి పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వ అప్పులుఅయితే దీనిపై కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వీ స్పందిస్తూ.. ఓ ప్రైవేటు ఫిర్యాదుపై మీనాక్షికి కోర్టు నోటీసు వచ్చిందని, కానీ ఆమెపై ఎటువంటి కోర్టు కేసు లేదన్నారు. తప్పుడు పద్ధతిలో మీనాక్షి రాజ్యసభ నామినేషన్ను తిరస్కరించినట్లు ఆరోపించారు. రిటర్నింగ్ అధికారి తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. ప్రైవేటు ఫిర్యాదును కోర్టు పరిగణలోకి తీసుకోలేని కారణంగా , ఆమె పై ఎటువంటి కేసు పెండింగ్లో లేదని కాంగ్రెస్ నేతలు చెప్పారు. రిట్నరింగ్ ఆఫీసర్ నిర్ణయం చాలా పేలవంగా ఉందని, ఏకపక్షంగా కూడా ఉన్నట్లు సింఘ్వీ ఆరోపించారు.

### మీనాక్షిపై కేసు

మీనాక్షి నటరాజన్ను తెలంగాణ ప్రజలు నికార్సైన గాంధేయవాదిగానే చూశారు. ఆమెపై క్రిమినల్ కేసులు ఉన్నాయనే ఆలోచన కూడా జనాలకు తెలియదు. 2025లో ఆమెపై క్రిమినల్ కేసుకు సంబంధించిన వ్యవహారం నడుస్తున్నట్లు తెలుస్తున్నదని, అంటే పక్కాగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే ఆమెపై కేసు నడుస్తున్నది. తన ప్రభుత్వంలో తనపైనే నమోదైన కేసుకు సంబంధించిన వివరాలు ఆమె వద్దే లేవు. కానీ ఎక్కడో మధ్యప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న బీజేపీ నేతలకు మాత్రం మీనాక్షి కేసు వివరాలు చేరాయి. ఇదేమీ తెలియకుండానే మీనాక్షి నటరాజన్ తన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారులకు సమర్పించారు. నామినేషన్ గడువు ముగిసేంత వరకు వేచిచూసిన అక్కడి బీజేపీ నేతలు.. నామినేషన్ పత్రాల పరిశీలనకు ముందు ఆమెపై తెలంగాణలో నమోదైన కొన్ని క్రిమినల్ కేసుల వివరాలను ఎన్నికల అఫిడవిట్లో సరిగ్గా పేరొనలేదని ఫిర్యాదు చేశారు. బీజేపీ ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన అధికారులు, నామినేషన్ పత్రాల్లో ఓ కేసులో రెస్పాండెంట్గా ఉన్న సమాచారం దాచారనే కారణంతో మీనాక్షి నటరాజన్ నామినేషన్ను రిటర్నింగ్ ఆఫీసర్ ఆనంద్ శర్మ తిరస్కరించినట్లు సమాచారం.

## ఎఫ్సీడీఏ కార్యాలయం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

- **ఫ్యూచర్సిటీలో పాలన**

### దిశగా సర్కార్ ముందడుగు




**టీ మీడియా, జూన్ 10, హైదరాబాద్ బ్యూరో :** రేపటి భవిష్యత్తుకు ఈనాడే పునాదులు వేశామన్న సీఎం రేవంత్ రెడ్డి, హైదరాబాద్కు గొప్ప చరిత్ర ఉందని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర ఆదాయంలో 60 శాతం ఆదాయం హైదరాబాద్ నుంచే వస్తోందని పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో పాలనను సమర్థవంతంగా, సాంకేతికంగా అందించేందుకు రెండెకరాల్లో నిర్మించిన భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి సంస్థ - ఎఫ్సీడీఏ కార్యాలయాన్ని రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఫ్యూచర్ సిటీ లోగో, పోర్టల్, వెబ్సైట్ను సీఎం ఆవిష్కరించారు. ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ కార్యాలయాన్ని స్పీకర్ గడ్డం ప్రసాద్కుమార్, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క మంత్రులు శ్రీధర్బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఇతర అధికారులతో కలిసి సీఎం పరిశీలించారు. ఫ్యూచర్సిటీలో పాలన దిశగా సీఎం రేవంత్రెడ్డి సర్కార్ ముందడుగు వేయనుంది. అనంతరం ఆయన మాట్లాడారు.

### ఫ్యూచర్ సిటీ మనకు మాత్రమే కాదు - ప్రపంచానికే


బంగారం కంటే రంగారెడ్డి జిల్లా భూములు విలువ ఎక్కువన్న సీఎం, కుతుబ్షాహీలు, నిజాంలు కృషి వల్ల హైదరాబాద్ అభివృద్ధి చెందిందని తెలిపారు. హైటెక్సిటీ అంటే నవ్విన వాళ్లు ఉన్నారని, విమానాశ్రయం, జీనోమ్వ్యాలీ, ఐటీ సంస్థలను ఆనాడు వ్యతిరేకించారని గుర్తు చేశారు. ఐటీ పరిశ్రమలు రాకుంటే ఈనాడు యువతకు ఉద్యోగాలు వచ్చేవా? అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ చెబుతోందని సీఎం అన్నారు. ఫ్యూచర్ సిటీ మనకు మాత్రమే కాదని, ప్రపంచానికి అని స్పష్టం చేశారు.

### ప్రతిపక్ష హోదా కూడా రాదు

బీఆర్ఎస్ పార్టీ రద్దయిన వెయ్యి నోటు అని సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు. ఆ పార్టీని ప్రజలు తిరస్కరించారని విమర్శించారు. ఆ పార్టీ నేతలు ప్రవర్తన ఇలాగే కొనసాగితే, వచ్చేసారి ప్రతిపక్ష హోదా కూడా రాదని విమర్శించారు. 2034 నాటికి ట్రిలియన్ డాలర్ ఎకానమీకిగా ఫ్యూచర్ సిటీ మారుతుందని తెలిపారు. టోక్యో, సింగపూర్లా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

## కాంగ్రెస్తోనే ప్రాంతీయ విద్వేషాలు

### ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్




**టీ మీడియా, జూన్ 10,హైదరాబాద్ :** బీఆర్ఎస్ పదేళ్ల తెలంగాణ పాలనలో జనసేన పార్టీపై గాని, తనపైగాని ఏనాడు ఆరోపణలు చేయలేదని జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. ఢిల్లీలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్వచ్చాకే ప్రాంతీయ విద్వేషాలు మొదలయ్యాయని ఆరోపించారు. గత 13 నెలలుగా తనను పర్సనల్గా టార్గెట్ చేసి విమర్శిస్తున్నారని దుయ్యబట్టారు.తెలంగాణ ప్రభుత్వ అప్పులుతెలంగాణకు రావొద్దని మంత్రుల స్థానంలో ఉన్న వ్యక్తులు బెదిరించడాన్ని జీర్ణించుకోలేకే మీ అయ్య జాగీరా అనే పదం వాడానని స్పష్టం చేశారు. తెలంగాణలో సభ పెట్టుకోవడానికి అభ్యంతరం వ్యక్తం చేయడం, తెలంగాణలోకి రావొద్దనడం ప్రాథమిక హక్కుకు భంగమని అన్నారు.తెలంగాణలోనే జనసేన పుట్టిందని, తెలంగాణలో లీడర్స్, కేడర్స్కు పార్టీకి ఉందని, సుమారు లక్షన్నర సభ్యత్వం ఉందని వెల్లడించారు. పార్టీ నాయకులు , కార్యకర్తలు ఉత్సాహంగా ఉన్నప్పుడు వాళ్ల కోసం పని చేయొద్దా అని ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, తన వంతు సహకారం అందించాలనుకోవడంలో తప్పేముందని అన్నారు. తెలంగాణలో పోటీ చేయాలన్న ఆసక్తి తనకు లేదని తెలిపారు.

## గల్ఫ్లో యుద్ధ మేఘాలు

3లో..

## 8 నుంచి పదో తరగతికి రూ.లక్షపైనే ఫీజు

- **ఎల్కేజీ పుస్తకాల సెట్కు రూ.3 వేలు వసూలు**
- **ప్రైవేటు స్కూళ్ల దోపిడీ**




**టి మీడియా, జూన్ 10, హైదరాబాద్ బ్యూరో :** పిల్లలకు ఉత్తమ విద్య అందించాలనే తల్లిదండ్రుల ఆశయాన్ని పలు ప్రైవేట్? పాఠశాలల యాజమాన్యాలు అవకాశంగా మలుచుకుంటున్నాయి. ప్రతి ఏడాది ఇష్టానుసారంగా ఫీజులు పెంచుతూ మధ్యతరగతి, పేద వర్గాలపై అధిక భారాన్ని మోపుతున్నాయి. రాష్ట్రంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో చాలా వాటిలో సీబీఎస్ఈ, ఒలంపియాడ్, ఐఐటీ ఫౌండేషన్, టెక్నో, ఐఐటీ ఫౌండేషన్ పేరిట ప్రచారంతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. నర్సరీ, ఎల్కేజీ, యూకేజీల్లోనే రూ.50 వేలలోపు వసూలు చేస్తున్నారు. ఇక కొత్త అడ్మిషన్ అయితే అదనంగా రూ.2 వేల వరకు చెల్లించాల్సిందేనని తేల్చి చెబుతున్నారు. జగిత్యాలకు చెందిన లక్ష్మీనారాయణది దిగువ మధ్యతరగతి కుటుంబం. స్థానికంగా ఓ వస్త్ర దుకాణంలో గుమాస్తాగా పని చేస్తున్నారు. తన కుమార్తె నాలుగో తరగతి, కుమారుడు 8వ తరగతి చదువుతున్నారు. అక్కడే ఓ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించడానికి వెళ్లగా నాలుగో తరగతికి రూ.40 వేలు, ఎనిమిదో తరగతికి రూ.72 వేలు ఫీజు చెల్లించాలని యాజమాన్యం తెలపడంతో అవాక్కయ్యారు.

### నియంత్రణ కరువు

ప్రైవేట్ స్కూల్ల్లో ఫీజుల నియంత్రణ లేకపోవడంతో కొన్ని యాజమాన్యాలు అధికంగా నిర్ణయించారు. సాధారణంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన విధంగా వసూలు చేయాలి. గతంలో ప్రాథమిక తరగతులకు రూ.9వేలు, ఉన్నత తరగతులకు రూ.13 వేలకు సర్కారు నిర్ణయించగా ఆయా యాజమాన్యాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. దీంతో సదరు ఉత్తర్వులు నిలిపివేశారు. అప్పటినుంచి పాఠశాల యాజమాన్యాలే ఫీజులు నిర్ణయించుకునే వెలుసుబాటు కల్పించింది. ఫీజుల క్రమబద్ధీకరణకు కమిటీ లేకపోవడంతోనే ఈ సమస్యకు కారణమైంది.అధిక ఫీజుల వసూళ్లకు సంబంధించి మాకెలాంటి ఫిర్యాదు రాలేదు. ఫీజుల నిర్ణయం ఆయా పాఠశాలల యాజమాన్యాలదే. సౌకర్యాలకు సంబంధించి నిబంధనలు అతిక్రమిస్తే ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం" - రాము, డీఈవో, జగిత్యాల

### అన్నింటికీ చెల్లించాల్సిందే!

5వ తరగతి నుంచి 7 తరగతి వరకు రూ.35 వేల నుంచి రూ.70 వేల వరకు ఫీజులున్నాయి. 8వ తరగతి నుంచి 10వ తరగతికి రూ.లక్ష పైనే ఉంది. మరి ఇంత ఫీజులు ఎందుకని తల్లిదండ్రులు ప్రశ్నిస్తే పిల్లలకు ఐఐటీ ఫౌండేషన్? కోర్సు బోధిస్తున్నామని ఏదో మాటలు చెబుతున్నారు. మరోవైపు పాఠశాల యూనిఫాం, టై, బూట్లు, బెల్ట్? ఇలా అన్నింటికీ ప్రత్యేక ధరలు నిర్ణయించి తమవద్దే కొనుగోలు చేయాలని యాజమాన్యాలు నిబంధన విధించాయి. కానీ దీనివల్ల తల్లిదండ్రులకు అదనపు భారం అవుతోంది.

### పుస్తకాల కొనుగోలుకు రూ.3-8 వేల వరకు

ప్రైవేటు ఉద్యోగుల వేతనాలు, ఉపాధి శ్రామికులు, రోజువారీ కూలీల వేతనాలు ప్రతి ఏడాది పెరిగే పరిస్థితి ఉండదు. అయితే పిల్లల చదువులకు వచ్చేసరికి ప్రతి ఏటా స్కూల్? ఫీజులకు, పుస్తకాలకు వెచ్చించే ఫీజు చెల్లింపులు పెరుగుతుంది. కేవలం నర్సరీ చదువుకు పాఠశాల పరిస్థితిని అనుసరించి రూ.15వేల నుంచి రూ.20 వేల వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇవన్నీ చూస్తుంటే చదువులు ఎంత ఖరీదుగా ఉన్నాయనే విషయం ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కేవలం పుస్తకాలు కొనుగోలు చేసేందుకే రూ.3 నుంచి రూ.8 వేల వరకు పాఠశాల యాజమాన్యాలు వసూలు చేస్తున్నారు.

### యాజమాన్యాల కాసుల వర్షం

కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో 1000 నుంచి 2000 మంది వరకు విద్యార్థులు ఆయా తరగతుల్లో చదువుతున్నారు. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభమైతే ఆ యాజమాన్యాలకు కాసుల వర్షం కురుస్తోంది. ఉదాహరణకు ఆ పాఠశాలలో 2000 మంది విద్యార్థులు ఉన్నారనుకుంటే సుమారుగా ఒక్కో విద్యార్థిని రూ.5 వేలు చొప్పున అనుకున్న కేవలం పుస్తకాల మీదే రూ.కోటికి పైగా వ్యాపారం జరుగుతోంది. దీనిలో సుమారు 40 శాతం వారికి లాభం ఉండనుంది.

# ఇరాన్‌లో చిక్కుకున్న ఉత్తరాంధ్ర యువకులు

- ఆహారం, నీరు లేక నౌకలోనే నరకయాతన



**టి మీడియా, జూన్, 10, అమరావతి బ్యూరో:** పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్‌లోని తీర ప్రాంతంలో ఉత్తరాంధ్రకు చెందిన పలువురు యువకులు చిక్కుకుపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నెలల తరబడి నౌకలోనే ఉండిపోవాల్సి వస్తోందని, సరైన ఆహారం, తాగునీరు కూడా అందక నరకయాతన అనుభవిస్తున్నామని వారు వీడియో ద్వారా తమ కుటుంబ సభ్యులకు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటన వారి బంధువులను ఆందోళనకు గురిచేస్తోంది.

### బందర్ అబ్బాస్ పోర్టు సమీపంలో నిలిచిపోయిన నౌక

విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం చింతపల్లి పంచాయతీకి చెందిన కొమర సోమరాజు ప్రస్తుతం 'ఎంవీ పాస్కల్' అనే నౌకలో ట్రైనీ వైపర్‌గా పనిచేస్తున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ పోర్టు సమీప యాంకరేజ్ ప్రాంతంలో ఈ నౌక నిలిచిపోయింది. దీంతో సిబ్బంది బయటకు రావడానికి, స్వదేశాలకు చేరుకోవడానికి ఎటువంటి అవకాశాలు లేకుండా పోయాయి.

### నలుగురు ఉత్తరాంధ్ర వాసులు

ఎంవీ పాస్కల్ నౌకలో మొత్తం 13 మంది సిబ్బంది ఉన్నారు. వారిలో నలుగురు విదేశీయులు కాగా, మిగిలిన వారు భారతీయులు. ఉత్తరాంధ్రకు చెందిన కొమర సోమరాజుతో పాటు శ్రీకాకుళం జిల్లా శ్రీకూర్మానికి చెందిన జెర్రి విష్ణు, ఆమదాలవలసకు చెందిన దుర్గాప్రసాద్, పరిపతివానిపేటకు చెందిన పరపతి రమణ కూడా అక్కడే చిక్కుకుపోయారు. తమ పరిస్థితి రోజురోజుకూ దారుణంగా మారుతోందని వారు వీడియో ద్వారా తమ ఆవేదనను వ్యక్తం చేశారు.

### ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షల వసూలు

కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, వీరంతా ముంబయిలోని ఓ ఏజెంట్ ద్వారా ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లారు. ఒక్కొక్కరి నుంచి సుమారు రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపిస్తున్నారు. అయితే ఆరు నెలల ఒప్పందం పూర్తయినప్పటికీ యాజమాన్యం వారిని స్వదేశాలకు పంపే చర్యలు చేపట్టలేదని బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి.

### 12 నెలలుగా జీతం బకాయి, కుటుంబాల్లో ఆందోళన

నౌక యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా దాదాపు నాలుగు నుంచి అయిదు నెలలుగా సరైన ఆహారం, తాగునీరు కూడా అందడం లేదని బాధితులు చెబుతున్నారు. మరోవైపు, కొమర సోమరాజుకు గత 12 నెలలుగా జీతం కూడా చెల్లించలేదని ఆయన తల్లిదండ్రులు వాపోతున్నారు. తమ పిల్లల ప్రాణాలకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి వారిని సురక్షితంగా స్వదేశానికి తీసుకురావాలని కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### వీడియోతో వెలుగులోకి వచ్చిన దుస్థితి

బాధిత యువకులు పంపిన వీడియోలు ప్రస్తుతం కుటుంబ సభ్యుల మధ్య తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. యుద్ధ ప్రభావిత ప్రాంతంలో చిక్కుకున్న తమ వారిని కాపాడాలని, స్వదేశానికి తీసుకురావాలని, విదేశాంగ శాఖ తక్షణమే జోక్యం చేసుకోవాలని కుటుంబాలు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నాయి. పరిస్థితిపై అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కూడా కోరుతున్నారు.

## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

-హాజరైన అదనపు కలెక్టర్



**టీ మీడియా, జూన్ 10 పెబ్బేరు:** పెబ్బేరు మున్సిపాలిటీలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో బాగంగా వార్డు సభలు నిర్వహించారు ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ (స్థానిక సంస్థలు) హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ రోడ్డు భద్రతా బాల్యవివాహాల నిర్మూలన వర్షాకాలం నేపథ్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు పంట మార్పిడి ఎరువుల వాడకం పరిసరాల పరిశుభ్రత వన మహోత్సవం జల సంరక్షణ పాఠశాలల్లో సౌకర్యాల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా వర్షాలు సమృద్ధిగా కురిసి తద్వారా పర్యావరణ సమతుల్యత చేకూరి రాబోయే తరాలకు మెరుగైన భవిష్యత్తు లభిస్తుందని అన్నారు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో భూగర్భ జలాలు పెరిగి మంచినీటి సదుపాయాలు కలుగుతాయి అన్నారు అదేవిధంగా గ్రామంలో గత ఐదేళ్ల వ్యవధిలో 18 ఏళ్ల నుండి 59 ఏళ్లలోపు వ్యక్తులు ఎవరైనా మరణిస్తే జాతీయ కుటుంబ ప్రయోజన పథకం ద్వారా దరఖాస్తు చేసుకొని రూ 20 వేల లబ్ధి పొందవచ్చునితెలిపారు ప్రభు త్వం అర్హులైన ఓటర్లందరినీ జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ కార్యక్రమం నిర్వహిస్తుందని ఇందులో ప్రతి ఒక్కరూ పాల్గొని అధికారులకు సహకరించాలని సూచించారు ప్రస్తుతం జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలు ఉన్నాయని కాబట్టి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి చదివించాలని సూచించారు ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మార్కెట్ చైర్మన్ ప్రమోదినీ రెడ్డి వైస్ చైర్మన్ ఎద్దుల విజయ వర్ధన్ రెడ్డి వార్డ్ కౌన్సిలర్ లు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మండల వ్యవసాయ అధికారి ఎంపీఓ ఎస్ఐ వెంకటేష్ గౌడ్ పంచాయతీ కార్యదర్శి ప్రజాప్రతినిధులు ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు.

## గంజాయి ముఠా రాళ్ల దాడి

- కాల్పులు జరిపిన ఎస్సై



**టి మీడియా, జూన్, 10, అమరావతి బ్యూరో:** అల్లూరి జిల్లా అన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి స్మగ్లర్ల పై పోలీసుల కాల్పులు కలకలం సృష్టించింది. ఒడిశా నుంచి చింతపల్లి మండలం లోతు గడ్డ మీదుగా వెళుతున్న గంజాయి ముఠా వాహనాలను పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో గంజాయ్ స్మగ్లర్లు రాళ్లతో పోలీసులపై దాడులకు ప్రయత్నం చేశారు. దాంతో హెడ్ కానిస్టేబుల్ తప్పించుకున్నారు. నిందితులు హెడ్ కానిస్టేబుల్ కాలర్ పట్టుకుని దాడికి యత్నిస్తుండగా ఎస్సై సాయిరాం గాల్లో రెండు రౌండ్లు కాల్పులు జరిపారు.

దాంతో స్మగ్లర్లు వాహనాలు వదిలి పారిపోతుండగా పోలీసులు వెంటపడి అదుపులో తీసుకున్నారు. మొత్తం 209 కిలోల గంజాయితోపాటు ఓ కారు, రెండు బైక్?లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో రాజస్థాన్, ఛత్తీస్?గఢ్, ఒడిశా, ఆంధ్రకు చెందిన ముఠా ఉంది. ఒడిశా నుంచి ఆంధ్ర మీదుగా గంజాయ్ తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్ఐ సాయిరాం ఈ సందర్భంగా వెల్లడించారు. చింతపల్లి మండలం అన్నవరం స్టేషన్ పరిధిలో లోతుగడ్డ సమీపంలో ముందస్తు సమాచారంతో పోలీసు అధికారులు తనిఖీలను నిర్వహిస్తున్నారు.

### పోలీసులపై గంజాయి ముఠా రాళ్ల దాడి

1బంధ్‌వారం తెల్లవారుజామున పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో గంజాయితో వస్తున్న కారును తనిఖీ చేస్తున్న క్రమంలో గంజాయి ముఠా పోలీసులపై రాళ్లతో దాడి చేసింది. ఈ దాడిలో హెడ్ కానిస్టేబుల్ కాలర్ కాలర్ పట్టుకున్నారు. అప్రమత్తమైన ఎస్సై గాలిలోకి కాల్పులు జరపడంతో స్మగ్లర్లు వెనక్కి తగ్గారు. వారు పరారవుతుండగా నలుగురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## మాదిగలు అన్ని రంగాల్లో ప్రథమ స్థాయికి చేరుకోవాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ



**టీ మీడియా, జూన్ 10, వనపర్తి బ్యూరో :** తర తరాలుగా విద్యాపరంగా, సామాజికంగా, సాంస్కృతికంగా, ఆర్థికంగా తీవ్రంగా వెనకబాటుతనానికి గురైన మాదిగ ప్రజలు విజ్ఞానం, నైపుణ్యం, సృజనాత్మకతలను ఆయుధాలుగా చేసుకొని అన్ని రంగాల్లో ఎదగడానికి నడుం బిగించాలని ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ అన్నారు. వనపర్తి మండలం చిట్యాల గ్రామంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మాదిగల చైతన్య సమావేశం ఎమ్మార్పీఎస్ వనపర్తి మండల అధ్యక్షులు మచ్చ తిరుపతి మాదిగ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మార్పీఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు కొమ్ము చెన్నకేశవులు మాదిగ, ఎం ఎస్ ఎఫ్ వనపర్తి జిల్లా అధ్యక్షులు మొలకలపల్లి పరుషరాముడు మాదిగ మాట్లాడుతూ మూడు దశాబ్దాల పాటు రాజీ లేని పోరాటం చేసి పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మాదిగ జాతికి ఎస్సీ వర్గీకరణను సాధించి పెట్టాడని అన్నారు . ఎస్సీ వర్గీకరణ ద్వారా తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు అందుతున్న 9 శాతం రిజర్వేషన్లను సంపూర్ణంగా సద్వినియోగం చేసుకొని విద్యా , ఉద్యోగాలలో రాణించాలని అన్నారు. మాదిగల్లో అక్షరాస్యత తక్కువగా ఉన్నందున ఇకపై ఎవరు చదువులకు దూరం కావద్దని అన్ని మార్గాలను ఉపయోగించుకొని ప్రాథమిక విద్యా, మాధ్యమిక విద్య, ఉన్నత విద్యలో ముందుకు సాగాలని అన్నారు. వివిధ కారణాలవల్ల చదువులకు దూరమైన విద్యార్థిని విద్యార్థులు తక్షణమే బడి బాట పట్టాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగలు విద్యా, ఉద్యోగ ,సామాజిక ,ఆర్థిక, వ్యాపార , రాజకీయ మొదలగు రంగాల్లో ప్రథమ స్థాయిలోకి చేరుకోవడానికి ఇప్పటినుండి తీవ్రంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేయించిన సామాజిక, ఆర్థిక, కుల గణన సర్వేలో తెలంగాణలో అత్యధిక పేదరికం కలిగి ఉన్న కులంగా మాదిగలే ఉన్నారని తేలిందని, అలాగే భూమిలేని వారిలో , ఆస్తులు లేని వారిలో, మరియు రోజువారి కూలి పని చేసుకుంటున్న వారిలో మాదిగలే మొదటి స్థానంలో ఉన్నారని స్పష్టంగా బయటపడిందని అన్నారు. అందువల్ల పేదరికం, వెనుకబాటుతనం, నిరక్షరాస్యతను తొలగించుకోవడం కోసం, సామాజిక అభివృద్ధి కోసం రాజకీయాలకతీతంగా మాదిగ జాతి ఐక్యమత్యంతో ముందుకు సాగాలని అన్నారు. అందులో భాగంగా మందకృష్ణ మాదిగ నడుపుతున్న ప్రతి పోరాటంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మాదిగ జాతి కోసం మొదలైన ఎమ్మార్పీఎస్ ఉద్యమం 32వ వసంతంలోకి చేరుకుంటున్న సందర్భంగా జులై 7న మాదిగల జెండా పండుగగా ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగరవేసి సంబరాలను అంబరాన్ని అంటే విధంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు మాదిగ మాదిగ, వర్మ మాదిగ సోషల్ మీడియా నాయకులు, బలపిరు శంకర్ బాలయ్య, వెంకటమ్మ మన్నేమ్మ రాములమ్మ మహిళలు తదితరులు పాల్గొన్నారు.



## తెగిపడిన కరెంట్ వైర్

- విద్యుత్ షాక్‌తో రెండు నిండు ప్రాణాలు బలి

**టి మీడియా, జూన్ 10, హైదరాబాద్ బ్యూరో:** హైదరాబాద్? నగరంలోని చాలా చోట్లు ఈదురుగాలులతో వానపడింది. దీంతో అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. ఫలితంగా విద్యుత్? సరఫరాకు అంతరాయం కలిగింది. భారీ వర్షానికి ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. సమస్యను పరిష్కరించేందుకు హైడ్రా బృందాలు రంగంలోకి దిగాయి. భారీ వర్షం, ఈదురుగాలులకు పాతబస్తీ బండ్లగూడలో కరెంట్ తీగలు తెగిపడ్డాయి. ఈ ఘటనలో జాఫర్(25), అబూ(16) అనే ఇద్దరు యువకులు మృతి చెందారు. ఛత్తా బజార్‌లో రోడ్డుపై కమాన్ కూలింది. ఆ సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో ప్రాణ, ఆస్తినష్టం తప్పింది.

### ఈ ప్రాంతాల్లో భారీ వర్షాలు

నగరంలోని కేపీహెచ్‌బీ, బాచుపల్లి, ప్రగతినగర్, మియాపూర్, చందానగర్, ముషీరాబాద్, చంపాపేట్, కర్మన్‌ఘాట్, సరూర్‌నగర్, సైదాబాద్, కోఠి, సుల్తాన్‌బజార్, అబిడ్స్, బషీర్‌బాగ్‌లో, నారాయణగూడ, హైదర్‌గూడ, లక్డీకపూల్, ట్యాంక్‌బండ్ ప్రాంతాల్లో వర్షం కురిసింది. మాదాపూర్, కొండాపూర్, రాయదుర్గం, రాజేంద్రనగర్, హైదర్‌గూడ, లంగర్‌హౌస్, కార్వాన్, మెహదీపట్నం, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, చిక్కడపల్లిలో వాన పడింది. బాగ్‌లింగంపల్లి, గాంధీనగర్, బోలక్‌పూర్, కవాడిగూడ, రామ్‌నగర్ ప్రాంతాల్లో వర్షం కురిసింది.

### ఈదురుగాలులకు నేలకొరిగిన చెట్లు

సికింద్రాబాద్, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, అల్వాల్, గచ్చిబౌలి, లింగంపల్లి, హైటెక్‌సిటీలో భారీ వర్షం కురిసింది. బొల్లారం, ప్యాట్నీ, ప్యారడైజ్, మారేడుపల్లి, చిలకలగూడ, జేబీఎస్, బేగంపేట్ ప్రాంతాలలో భారీ వర్షం పడింది. ఈ భారీ వర్షాల కారణంగా హైదర్‌గూడలో ఓ భారీ వృక్షం నెలకొరిగి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రామ్‌నగర్ వీఎస్టీ రోడ్డులో మరో చెట్టు నేలకొరిగింది. ముషీరాబాద్‌లో ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

### ట్రాఫిక్‌కు అంతరాయం

భారీ వర్షం కారణంగా అనేక ప్రాంతాల్లో ట్రాఫిక్? జామ్? అయింది. లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లన్నీ జలమయం అయ్యాయి. భారీ వర్షం నేపథ్యంలో మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, మియాపూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం రహదారులపై వరద నీరు నిలిచిపోయింది. వరద నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

### రోడ్లపై వరద ప్రవాహం

మాదాపూర్ పర్వత్‌నగర్ చౌరస్తా వద్ద వరద వర్షపు నీరు నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ఇదే తరహాలో గచ్చిబౌలి, మాదాపూర్‌లో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. నాంపల్లి పరిసర ప్రాంతాల్లో రోడ్లపై వరద నీరు ప్రవహించింది. దీంతో ఆప్రాంతంలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మియాపూర్ జేపీనగర్‌లో రోడ్డుపై భారీగా వరద నీరు నిలిచిపోవడంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. హిమాయత్‌నగర్‌లోని ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో వృక్షం నేలకొరిగింది. బాగ్‌లింగంపల్లి సాయిబాబా ఆలయం వద్ద చెట్టు విరిగిపోవడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. రాజేంద్రనగర్‌లోని పాత కర్నూలు రహదారిపై వరద నీరు నిలిచింది.

### అత్యధికంగా 8.7 సెం.మీ. వర్షపాతం

హైదరాబాద్?లోని బన్సీలాల్‌పేటలో అత్యధికంగా 8.7 సెం.మీ, విఠల్‌వాడిలో 7.8 సెం.మీ, హిమాయత్‌నగర్‌లో 7.8 సెంటీమీటర్లు, విద్యానగర్‌లో 7.3 సెంటీమీటర్లు వర్షపాతం నమోదయింది. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద 7.8 సెం.మీ, బహదూర్‌పురలో 5.7 సెం.మీ, మారేడపల్లి 5.7 సెం.మీ, నాంపల్లిలో 5.5 సెం.మీ, ఆసిఫ్‌నగర్‌లో 5.5 సెం.మీ వర్షపాతం రికార్డు అయింది. శేరిలింగంపల్లిలో 5.3, కూకట్‌పల్లిలో 5.2 సెం.మీ, అంబర్‌పేటలో 4.7 సెం.మీ. వర్షపాతం నమోదయింది.

### హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటన

హైదరాబాద్ వరద ప్రభావిత ప్రాంతాల్లో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పర్యటించారు. ట్యాంక్‌బండ్‌పై వరద నీటి మళ్లింపు, కూలిన చెట్ల తొలగింపును పర్యవేక్షించారు. భారీ గాలులకు హైదరాబాద్‌లో 76 ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. కొండాపూర్, గచ్చిబౌలి, షేక్‌పేట, మాదాపూర్‌లో చెట్లు నేలకొరిగాయి. హైడ్రా డీఆర్‌ఎఫ్ బృందాలు రహదారులపై నిలిచిన నీటిని నాలాల్లోకి మళ్లిస్తున్నాయి. వీటికోసం ప్రత్యేకంగా భారీ మోటార్లను వినియోగిస్తున్నాయి. ప్రధాన రహదారుల్లో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు హైడ్రా సిబ్బంది కృషి చేస్తోంది.

## విద్యార్థులకు గుడ్ న్యూస్

- స్కాలర్‌షిప్‌ల దరఖాస్తులు ఏడాది పొడవునా స్వీకరణ



**టి మీడియా, జూన్ 10, హైదరాబాద్ బ్యూరో:** రాష్ట్రంలో సంక్షేమ విద్యార్థులకు బోధన ఫీజులు, స్కాలర్?షిపుల మంజూరుకు ఇక నుంచి ఏడాది పొడవునా సర్కారు దరఖాస్తులు స్వీకరించనుంది. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులు తాజాగా రెన్యువల్? దరఖాస్తులు చేసుకోవచ్చు. విద్యార్థులకు ఎప్పుడు కావాలన్న దరఖాస్తుకు పోర్టల్? తెరిచే ఉంటుంది. అయితే ఆలస్యం చేసినకొద్దీ ఫీజుల విడుదల ఆలస్యమవుతుంది. ముందు దరఖాస్తు చేసిన వారికి ముందుగానే మంజూరు చేస్తారు. ఏడాది ఫీజు ఒకేసారి చెల్లించేలా ప్రభుత్వం బోధన రుసుముల నిబంధనలు జారీ చేసింది. అయితే గతంలో బోధన ఫీజుల చెల్లింపులపై విడుదల చేసిన జీవో నం.7ను రద్దు చేసింది. అదే స్థానంలో తాజాగా కొత్త నిబంధనలతో బోధన ఫీజుల నోడల్? విభాగమైన ఎస్సీ సంక్షేమశాఖ ఉత్తర్వులు జీవో నం.9 జారీ చేసింది. ఈ నిబంధనలు ఈ విద్యా సంవత్సరం 2026–27 నుంచి అమల్లోకి రానున్నాయి.

### రుసుముల చెల్లింపులు ఇలా


ఏప్రిల్? 1 నుంచి జులై 31 వరకు అందిన దరఖాస్తులను పరిశీలించి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రాష్ట్ర వాటాను ఆగస్టు 15 నాటికి ప్రభుత్వం విడుదల చేస్తుంది. కేంద్రం వాటా విడుదల చేసిన వెంటనే ఆ మొత్తాన్ని విద్యార్థుల అకౌంట్?లో జమ చేస్తుంది. బీసీ, మైనార్టీ, ఈబీసీ, దివ్యాంగ విద్యార్థులకు ఆగస్టు 15న చెల్లిస్తుంది. అలాగే అగస్టు 1 నుంచి నవంబరు 30 వరకు దరఖాస్తు చేసిన విద్యార్థులకు డిసెంబరు 30 నాటికి, డిసెంబరు 1 నుంచి జనవరి 31 వరకు దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఫిబ్రవరి 28న, ఫిబ్రవరి 1 నుంచి మార్చి 31 వరకు దరఖాస్తు చేసిన విద్యార్థులకు 75 రోజుల్లోగా నిధులు విడుదల చేస్తామని ప్రభుత్వం షెడ్యూల్?లో తెలిపింది.

### వారం రోజుల్లో కళాశాలకు చెల్లించాలి

ఇకపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ విద్యార్థులకు ప్రత్యక్ష నగదు బదిలీ డీబీటీ కింద విద్యార్థుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో ఫీజుల మొత్తాన్ని జమ చేస్తారు. ఎస్సీ విద్యార్థుల స్కాలర్‌షిప్ మంజూరులో కేంద్రం అమలుచేస్తున్న విధానాలనే రాష్ట్ర సర్కారు అమలు చేయనుంది. ఈ మేరకు చెల్లింపుల షెడ్యూలును కూడా ప్రకటించింది. ఫీజులను విద్యార్థుల ఖాతాల్లోకి విడుదల చేసిన వారం రోజుల్లో వాటిని కళాశాలలకు చెల్లించాలి. ఆ గడువులోగా చెల్లించకుంటే ఆ విద్యార్థి నుంచి చట్టంలోని నిబంధనల కింద రికవరీ చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## దుర్ఘటన కంటే ముందే ప్రమాదం

- తప్పించుకున్న 16 మంది ఉద్యోగులు



**టి మీడియా, జూన్ 10, విశాఖ:** పెద్ద ముప్పు ముంచుకొచ్చే ముందే ఓ చిన్న ప్రమాదంతో సంకేతాలు వస్తాయంటారు. సరిగ్గా విశాఖ స్టీల్‌ప్లాంట్‌లోనూ అదే జరిగింది. స్టీల్‌మెల్ట్ షాప్‌లో ఉక్కు ద్రవం ఉప్పెనలా విరుచుకుపడక ముందే, ఎస్.ఎం.ఎస్–2లో ద్రావణం ఒలికింది. అయితే ఆ సమయంలో అక్కడ ఉన్న 16 మంది ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. కానీ తర్వాత వచ్చిన ముప్పు మాత్రం 8 మందిని పొట్టన పెట్టుకుంది. విశాఖ ఉక్కు కర్మాగారంలో సోమవారం ఒక ప్రమాదం కాదు. ఒకేలాంటి రెండు ప్రమాదాలు జరిగినట్లు తేలింది. స్టీల్ మెల్ట్ షాప్‌లో పెను ప్రమాదం జరగడానికి ముందే ఎస్?ఎంఎస్?–2 లోనూ దుర్ఘటన జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. సోమవారం సాయంత్రం 3 గంటల 57 నిమిషాలకు లాడిల్‌లో పేలుడు సంభవించి సుమారు 60 టన్నుల ఉక్కు ద్రవం ఒలికిపోయింది.

### "మృత్యుంజయులం" అంటూ వాట్సప్ గ్రూప్‌లలో మెసేజ్‌లు

కన్వర్టర్ నుంచి సెకండరీ మెటలర్జీకి లాడర్ వచ్చేటప్పుడు కార్ నిలిపి క్రేన్‌తో ఎత్తే సమయంలో ఈ బ్లాస్టింగ్ జరిగినట్లు గుర్తించారు. శాశ్వత ఉద్యోగులు నలుగురు, ఇద్దరు ఇన్‌ఛార్జులు, 10 మంది కళాసీలు మొత్తం 16 మంది ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. ప్రమాదం గురించి తెలిసి తోటి ఉద్యోగులు విధుల్లో ఉన్నవారికి ఫోన్లు చేయగా, వారి యోగక్షేమాలు చెబుతూ "మృత్యుంజయులం" అంటూ వాట్సప్ గ్రూప్‌లలో మెసేజ్‌లు కూడా పెట్టారు. ఆ తర్వాత కొద్దిసేపటికే 4 గంటల 25 నిమిషాలకు ఎస్?ఎంఎస్?–1లో భారీ పేలుడు సంభవించి 8 మంది అక్కడికక్కడే మరణించారు.

ఎస్ఎంఎస్?–2లో తొలుత సెకండరీ మెలటర్జీ వద్ద లాడల్?లో పేలుడు జరిగింది. ఎస్?ఎంఎస్?–1లో కంటిన్యూ క్యాస్టింగ్ డిపార్ట్?మెంట్ (జజణ) నుంచి మిషన్?–2కు పంపుతుండగా బ్లాస్టింగ్ చోటు చేసుకుంది. "నా 30 ఏళ్ల అనుభవంలో ఒకే రకమైన ప్రమాదం ఒకే డిపార్ట్?మెంట్ అయిన ఎస్?ఎంఎస్?–1, 2లలో చూడటం ఇదే మొదటిసారి" అని ఐఎన్?టీయూసీ కార్యదర్శి కోరాడ వెంకట్రావు తెలిపారు.

### 6 నెలల కిందటే భద్రతపై ఫిర్యాదు

స్టీల్ ప్లాంట్ యాజమాన్యం భద్రతా నిబంధనలను నిర్లక్ష్యం చేయడంతో ప్రాణాంతక ప్రమాదాలు జరుగుతున్నాయని ఏఐటీయూసీ యూనియన్ కేంద్ర రీజియన్ డిసెంబర్ 9న లేబర్ కమిషనర్‌కు లేఖ రాసింది. ఇండస్ట్రియల్ డిస్ప్యూట్ అండర్ సెక్షన్ 2(కే) ప్రకారం భద్రతా నిబంధనల ఉల్లంఘన, పునరావృతం అవుతున్న ప్రమాదాలపై చర్యలు తీసుకోవాలని కోరింది. 2024 జనవరి నుంచి 20 మంది మరణించారని 200 మందికి పైగా క్షతగాత్రులయ్యారని పేర్కొంది. ప్రమాదాలపై విచారణ నివేదికలూ విడుదల చేయలేదని ఆక్షేపించారు. సేఫ్టీ కమిటీ సమావేశాలు జరగట్లేదని, ప్రమాదాలను నివారించేందుకు =.×.చీ.ా. యాజమాన్యం సరైన చర్యలు తీసుకోవట్లేదని ఆరోపించారు. గతేడాది జరిగిన ప్రమాదాల వివరాలతో ఈ ఏడాది మార్చిలో డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్‌కు సైతం ఫిర్యాదు చేశారు.

### ఈ అంశాల పైనా ప్రత్యేకంగా దృష్టి

ఉత్పత్తి లక్ష్యం నిర్దేశించి, సమయం ఇవ్వకుండా ఒత్తిడి పెట్టడంతో ప్రొటోకాల్స్ అమలు కావట్లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ద్రవపు ఉక్కులో గ్యాస్ పూర్తిగా తొలగించకుండానే ముందుకు పంపారని, అందువల్లే లాడిన్?లో పేలుడు సంభవించిందనే విమర్శలు సైతం వస్తున్నాయి. ఉక్కు తయారీలో వాడే ఫెర్రో అల్లాయ్స్ బయట నుంచి కొంటారు. ఇవి కొన్నాళ్లుగా నాసిరకంగా ఉంటున్నాయనే ఆరోపణలున్నాయి.




## జపాన్ బాటలోనే నేపాల్

-భారత మామిడి దిగుమతిపై నిషేధం..

**టీ మీడియా, జూన్ 10,న్యూఢిల్లీ :** భారత మామిడి రైతుల కు మరో చేదువార్త వచ్చింది. జపాన్ బాటలోనే నేపాల్ కూడా నడిచింది. భారత మమాడి పండ్ల దిగుమతులపై ఇప్పటికే జపాన్ నిషేధం విధించగా.. ఇప్పుడు నేపాల్ కూడా నిషేధం విధించింది. అధిక స్థాయిలో రసాయన పురుగు మందులు ఉన్నాయనే ఆరోపణలపై భారత మామిడిని నేపాల్ నిషేధించింది. అధిక స్థాయిలో పురుగుమందులు ఉన్న భారత మామిడి పండ్ల దిగుమతిని నిషేధిస్తున్నట్లు బాలెన్ షా ప్రభుత్వం ప్రకటించింది. నేపాల్ భారతదేశానికి అతిపెద్ద మార్కెట్లలో ఒకటి కానప్పటికీ.. ఈ ఆంక్షలు అల్ఫోన్సో, దశేరి, చౌసా, కేసర్, లంగ్రా , బంగనపల్లి వంటి అత్యుత్తమ భారతీయ రకాల ఎగుమతులపై ప్రభావం ఉంటుందని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. మరోవైపు రసాయన పురుగు మందుల ఆనవాళ్లు ఉండటం భారతదేశపు పండ్ల ఉత్పత్తి విధానంపై సందేహాలను రేకెత్తిస్తోంది. నేపాల్ కూడా పరిమితంగా మామిడి పండ్లను ఉత్పత్తి చేస్తుంది. అయితే స్థానిక డిమాండ్‌ను తీర్చడానికి దేశీయ ఉత్పత్తి సరిపోవడం లేదు. మే మధ్య నుంచి జూలై మధ్య వరకు ఇవి అందుబాటులో ఉంటాయి. మధేష్ ప్రావిన్స్‌లోని సిరహా, సప్తరి , ధనుషా జిల్లాలు దేశంలో ప్రధాన మామిడి ఉత్పత్తి కేంద్రాలు. భారతీయ మామిడి పండ్లపై విధించిన ఈ ఆంక్షలు దేశీయ పండ్ల రకాలకు ప్రయోజనం చేకూరుస్తాయని నేపాల్ అధికారులు అంటున్నారు. భారతదేశం ఏటా 24 మిలియన్ మెట్రిక్ టన్నుల మామిడి పండ్లను ఉత్పత్తి చేస్తుంది. అందులో సుమారు 32 వేల మెట్రిక్ టన్నులు మాత్రమే ఎగుమతి చేస్తుండగా.. మిగిలినవి దేశీయంగా వినియోగమవుతున్నాయి.

# గల్ఫ్‌లో యుద్ధ మేఘాలు



- **అమెరికా హ్యాంగర్లు ధ్వంసం చేశామన్న ఇరాన్**

**టి మీడియా, జూన్ 10, ఢిల్లీ బ్యూరో:** పశ్చిమాసియా, గల్ఫ్ ప్రాంతంలో పరిస్థితులు మళ్లీ ఉద్రిక్తంగా మారుతున్నాయి. అమెరికా- ఇరాన్ మధ్య సైనిక ఘర్షణలు మరింత తీవ్రమవుతున్నాయి. అమెరికా వైమానిక దాడులకు ప్రతీకారంగా బహ్రెయిన్, కువైట్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (×=+జ) ప్రకటించింది. ఈ పరిణామాలు గల్ఫ్ ప్రాంతాన్ని మరో యుద్ధం అంచుకు తీసుకొచ్చే ప్రమాదం కనిపిస్తోంది. ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ కథనం ప్రకారం, అమెరికాకు చెందిన మొత్తం 21 వైమానిక, నౌకాదళ స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేపట్టినట్లు ఐఆర్‌జీసీ వెల్లడించింది. జోర్డాన్‌లోని అల్- అజ్రాక్ అమెరికా కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్?ను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. అలాగే జోర్డాన్‌లోని మువాఫాక్ సల్తీ ఎయిర్‌బేస్‌పై కూడా క్షిపణి దాడులు చేసినట్లు తెలిపింది. అంతేకాదు, అమెరికా అత్యాధునిక ఎఫ్-35 యుద్ధ విమానాల హ్యాంగర్లను కూడా ధ్వంసం చేసినట్లు ఐఆర్‌జీసీ సంచలన ప్రకటన చేసింది. అయితే ఈ ప్రకటనలపై అమెరికా నుంచి అధికారిక ధ్రువీకరణ వెలువడలేదు.

**ప్రతిస్పందనగానే చర్యలు**

మరోవైపు, బహ్రెయిన్‌లోని అమెరికా ఐదో నౌకాదళ ప్రధాన కార్యాలయాన్ని లక్ష్యంగా చేసుకుని డ్రోన్ దాడి చేసినట్లు ఐఆర్‌జీసీ ప్రకటించింది. స్థానిక కాలమానం ప్రకారం, తెల్లవారుజామున 2.30 గంటలకు దాడి జరిగిందని పేర్కొంది. దక్షిణ ఇరాన్‌లోని పలు ప్రాంతాలపై అమెరికా దాడులకు ప్రతిస్పందనగానే చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. ఐఆర్‌జీసీ ప్రకటన ప్రకారం, జాస్క్, సిరిక్, ఖెష్మ్ ప్రాంతాలపై అమెరికా దాడులు జరిపిందని ఆరోపించింది. ఈ దాడుల్లో సిరిక్ ప్రాంతంలోని టెలికమ్యూనికేషన్ టవర్ దెబ్బతినడంతో పాటు రెండు నీటి ట్యాంకులు ధ్వంసమయ్యాయని తెలిపింది. దీనికి ప్రతీకారంగానే బహ్రెయిన్‌లోని అమెరికా నౌకాదళ స్థావరాన్ని లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. ఇరాన్ ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే బహ్రెయిన్ అంతటా సైరన్లు మోగాయి. బహ్రెయిన్ అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రజలను అప్రమత్తం చేస్తూ సామాజిక మాధ్యమాల్లో ప్రకటన విడుదల చేసింది. పౌరులు, విదేశీయులు ప్రశాంతంగా ఉండాలని, సమీపంలోని సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించింది. స్థానిక మీడియా కథనం ప్రకారం, కువైట్, బహ్రెయిన్‌లలో పలుమార్లు పేలుళ్లు సంభవించినట్లు సమాచారం. దీంతో గల్ఫ్ దేశాల్లో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. ఈ పరిణామాలన్నింటికీ మూలకారణంగా అమెరికా ఆర్మీకి చెందిన అపాచీ హెలికాప్టర్ కూల్చివేత నిలిచింది. హర్మూజ్ జలసంధిలో గస్తీ నిర్వహిస్తున్న అమెరికా అపాచీ హెలికాప్టర్‌ను ఇరాన్ కూల్చివేసిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. హెలికాప్టర్‌లోని ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడ్డారని వెల్లడించారు. ఈ ఘటనకు ప్రతీకారంగా అమెరికా సెంట్రల్ కమాండ్ ఇరాన్‌పై సెల్ఫ్ డిఫెన్స్ స్ట్రైక్స్ ప్రారంభించినట్లు ప్రకటించింది. కమాండర్ ఇన్ చీఫ్ ఆదేశాల మేరకు ఇరాన్‌పై పరిమిత దాడులు చేపట్టినట్లు తెలిపింది. ఇరాన్ అన్యాయ దాడులకు ఇది తగిన ప్రతిస్పందన అని పేర్కొంది. "మా అత్యాధునిక అపాచీ హెలికాప్టర్‌ను ఇరాన్ కూల్చివేసింది. పైలట్లు సురక్షితంగా ఉన్నప్పటికీ అమెరికా దీనికి తప్పకుండా స్పందించాల్సి ఉంటుంది" అని ట్రంప్ తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పేర్కొన్నారు.

**భద్రంగా ఉండాలంటే!**

అమెరికా చర్యలపై ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా సైనిక ఉనికిని కొనసాగిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. "యుద్ధభూమిలో పరాజయాల తర్వాత కూడా అమెరికా మా సంకల్పాన్ని పరీక్షించాలని నిర్ణయించుకుంది. మా సాయుధ బలగాలు ఎలాంటి దాడి, బెదిరింపునైనా సమాధానం లేకుండా వదిలిపెట్టవు. భద్రంగా ఉండాలంటే మా ప్రాంతాన్ని విడిచి వెళ్లండి" అని ఆయన ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు. ఇక జోర్డాన్ ప్రభుత్వం కూడా కీలక ప్రకటన చేసింది. తమ భూభాగంలోని అమెరికా స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుని వచ్చిన ఐదు క్షిపణులను గగనతలంలోనే కూల్చివేసినట్లు వెల్లడించింది. కువైట్‌లో కూడా అప్రమత్త చర్యలు చేపట్టి వైమానిక రక్షణ వ్యవస్థలను సిద్ధం చేశారు. ఇరాన్-అమెరికా మధ్య ఘర్షణలు ఇప్పటికే ఉద్రిక్తంగా ఉన్న ఇరాన్-ఇజ్రాయెల్ వివాదానికి మరింత ఆజ్యం పోస్తున్నాయి. గల్ఫ్ ప్రాంతంలో అమెరికా సైనిక స్థావరాలు అధికంగా ఉండటంతో పరిస్థితి ఎటువైపు దారితీస్తుందోనన్న ఆందోళన అంతర్జాతీయ సమాజంలో వ్యక్తమవుతోంది. దౌత్య చర్చలకు అవకాశం తగ్గిపోతుండటంతో పశ్చిమాసియా మరోసారి యుద్ధ భయాలతో వణికిపోతోంది.

# గ్రేహౌండ్స్‌ను ఇతర సేవలకు ఉపయోగిస్తాం

- **డీజీపీ సీవీ ఆనంద్**

**టీ మీడియా, జూన్ 10, ఆదిలాబాద్ :** తెలంగాణలో మావోయిజం అంతరించిందని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. ఆదిలాబాద్ జిల్లాలో ఒకరోజు పర్యటనలో భాగంగా బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇక గ్రేహౌండ్స్ ను ఆహార కల్తీ నియంత్రణ కోసం, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌కు వినియోగిస్తామన్నారు . లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం కల్పిస్తున్నామని పేర్కొన్నారు.ఆదిలాబాద్ జిల్లాలో రెండు నెలలుగా ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గాయని వివరించారు. 44వ జాతీయ రహదారిపై ఎక్కువగా ప్రమాదాలు జరుగటానికి అక్రమ పార్కింగ్ అని తమ విచారణలో తెలిందని అన్నారు. ప్రమాదాల నియంత్రణకు పోలీసులకు, ప్రజలు సహకారం అందించాలని కోరారు. వేగం తక్కువగా ఉండేలా వాహనదారులు వాహనాలు నడుపాలని సూచించారు .గంజాయి, డ్రగ్ నివారణకు చర్యలు తీసుకుంటున్నామని, పంజాబ్ రాష్ట్రంలో మాదిరిగా డ్రగ్స్‌కు తెలంగాణ యువకులు బానిసలు కావద్దన్నారు. ఆదిలాబాద్ జిల్లా పోలీసులు అద్భుతంగా పనిచేస్తున్నారని, ఇతర జిల్లాల మాదిరిగా జిల్లా పోలీసులపై ఫిర్యాదులు లేవన్నారు. భూపాలపల్లి,ఆదిలాబాద్, ఆసిఫాబాద్ , ములుగు జిల్లాలో గంజాయి ఎక్కువగా సాగు చేస్తున్నారని, జిల్లాలో గంజాయి సాగు చేసిన నూట పది మంది రైతులకు రైతు భరోసా నిలిపివేసినట్లు తెలిపారు.







## యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

**టీ మీడియా, జూన్ 10, వనపర్తి బ్యూరో :** నేటి సమాజంలో మాదక ద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుకు పెను ముప్పుగా మారిందని క్షణిక ఆనందం కోసం డ్రగ్స్‌కు అలవాటు పడిన వారు తమ ఆరోగ్యం, విద్య, కుటుంబ బంధాలు నాశనం చేసుకోవద్దని జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా అన్నారు. బుధవారం జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ యాంటి నార్కోటిక్ బ్యూరో మరియు వనపర్తి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వనపర్తి ప్రభుత్వ వైద్య కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వనపర్తి అదనపు ఎస్పీ రాజేష్ మీనా యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. గతంలో గంజాయి కేసుల్లో ఉన్న వ్యక్తులతో విద్యార్థులకు ప్రత్యక్షంగా అనుభవాలు పంచించడం ద్వారా డ్రగ్స్ వ్యసనం వల్ల కలిగే తీవ్ర పరిణామాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించి, కళాశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని అందించారు. అదనపు ఎస్పీ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వ్యసనం అనేది నేటి సమాజం ఎదుర్కొంటున్న అత్యంత ప్రమాదకరమైన సామాజిక సమస్యలలో ఒకటి. ఇది కేవలం ఒక వ్యక్తి ఆరోగ్యాన్ని మాత్రమే కాదు, అతని కుటుంబాన్ని, భవిష్యత్తును, విద్యను, ఉపాధిని , సమాజంలో అతని గౌరవాన్ని కూడా పూర్తిగా నాశనం చేస్తుంది. మాదకద్రవ్యాలకు బానిసైన యువత తమ జీవిత లక్ష్యాలను కోల్పోవడంతో పాటు నేరాల వైపు ఆకర్షితులయ్యే ప్రమాదం కూడా ఉంది. ప్ర గంజాయి కేసుల్లో గతంలో పాల్గొన్న వ్యక్తుల అనుభవాలను ప్రత్యక్షంగా వినిపించడం ద్వారా విద్యార్థులకు వాస్తవ పరిస్థితులను తెలియజేశాము. మాదకద్రవ్యాలు మనిషి జీవితాన్ని ఎలా ఛిన్నాభిన్నం చేస్తాయో వారు స్వయంగా అనుభవించిన సంఘటనల ద్వారా అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పి బాలాజీ నాయక్, వనపర్తి నార్కోటిక్ ఎస్సై, అంజద్ వనపర్తి రూరల్ ఎస్సై, హృషికేష్,వనపర్తి జిల్లా డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు, చెన్నమ్మ తామస్, వనపర్తి జిల్లా షీ టీం, భరోసా, ఏ హెచ్ టి యూ, నార్కోటిక్, సిబ్బంది వైద్య కళాశాల, అధ్యాపకులు, విద్యార్థినివిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అక్షరాభ్యాసం విషాదాంతం

- **ముగ్గురు సోదరుల దుర్మరణం**

**టి మీడియా, జూన్ 10, నిర్మల్ :** పవిత్ర గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి, చదువుల తల్లి సరస్వతీ దేవి ఆలయంలో తమ పిల్లలకు అక్షరాభ్యాసం చేయించాలని వెళ్లిన ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అన్నదమ్ములు చంద్రశేఖర్(38), రామచందర్ (36), మల్లేశ్ కుమార్ (31) గోదావరి నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయిన ఘటన నిర్మల్ జిల్లా బాసరలో చోటుచేసుకుంది.

**పోలీసుల కథనం ప్రకారం**

వివరాల్లోకి వెళితే కాచిగూడ చప్పల్ బజార్?కు చెందిన ఓ నిరుపేద కుటుంబం. ముగ్గురు అన్నదమ్ములు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద కాలిబాటపై సెల్‌ఫోన్ ఇయర్ ఫోన్లు విక్రయించి రోజువారీగా జీవనం కొనసాగిస్తున్నారు. వీరి కుటుంబానికి చెందిన 8 మంది మంగళవారం సరస్వతి అమ్మవారి దర్శనానికి ఉదయం కాచిగూడ నుంచి రైలులో బయలుదేరి బాసరకు చేరుకున్నారు. అనంతరం గోదావరిలో పుణ్య స్నానాలు చేయడానికి వెళ్లారు. స్నానాలు చేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో కాలుజారి పడిపోయిన



చంద్రశేఖర్?ను కాపాడడానికి వెళ్లి మల్లేశ్, ఆయనను కాపాడడానికి వెళ్లి మరో సోదరుడు రామచందర్ నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు, అధికారులు గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టారు. నాలుగు గంటల పాటు తీవ్రంగా శ్రమించి తరువాత మృతదేహాలను బయటకు తీశారు. పోలీసులు మృత దేహాలను పోస్టుమార్టం నిమిత్తం బైంసా ఆసుపత్రికి తరలించారు. మృతులలో పెద్దవారైన చంద్రశేఖర్, రామచందర్?కు వివాహాలు అయ్యాయి. రామచందర్?కు ఇద్దరు కుమారులు. అమ్మవారిని దర్శించుకొని పిల్లలకు అక్షరాభ్యాసం చేయించాలని కుటుంబ సభ్యులంతా సంతోషంతో కలిసివచ్చారు. అంతలో ఈ విషాదం చోటు చేసుకోవడంతో వారి కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

**రెండేళ్ల క్రితమే భార్య మృతి**

రెండేళ్ల క్రితమే ఇంటిపెద్ద నాగభూషణం భార్య క్యాన్సర్‌తో మరణించింది. ఆ ఘటన నుంచి ఇంకా బయటపడక ముందే వృద్ధాప్యంలో అండగా ఉంటారనుకున్న ముగ్గురు కుమారులు గోదావరిలో మునిగి మృత్యుఒడిలోకి వెళ్లడంతో ఆ తండ్రి బాధ వర్ణనాతీతం అయ్యింది. ఇప్పుడు తన మనవళ్ల భారం పెద్దాయన నాగభూషణం మీదే పడింది. ఇప్పుడు తమకు ఎవరు దిక్కని వాపోయారు. మృతులది నిరుపేద కుటుంబం కావడంతో బాసరకు చెందిన యువకులు వారికి అండగా నిలిచారు. మృతదేహాలను హైదరాబాద్‌కు తరలించేందుకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందజేసి మానవత్వం చాటుకున్నారు.

**ప్రమాదాలు జరగకుండా**

గోదావరి నదిలో తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. గతేడాది జూన్ 14న హైదరాబాద్‌కు చెందిన 20 ఏళ్లలోపు ఐదుగురు యువకులు నీటిలో మునిగి ప్రాణాలు విడిచారు. ఇందులోనూ ముగ్గురు అన్నదమ్ములు ఉండటం మరీ బాధాకరమైన విషయం. ఇవేకాకుండా తరచూ బాసర వద్ద ప్రమాదాలు జరగడం ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదాలు జరిగినప్పుడే అధికార యంత్రాంగం హడావుడి చేస్తుంది తప్ప పునరావృతం కాకుండా పకడ్బందీగా తగిన ఏర్పాట్లు చేపట్టడం లేదనే విమర్శలు స్థానికుల నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికేనా ప్రమాదాలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.



## రావుల చంద్రశేఖరరెడ్డి జన్మదిన వేడుకలు

**శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి సింగిరెడ్డి**

**టీ మీడియా, జూన్ 10, వనపర్తి బ్యూరో :** మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి స్వగృహంలో మాజీ ఎం.పి,మాజీ ఎమ్మెల్యే , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖరరెడ్డి జన్మదిన వేడుకలు బుధవారం నిర్వహించారు. బి.ఆర్.ఎస్ ర్ నాయకులు, కళ సాహితీ వేదిక,ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి రావులకు శుభాకాంక్షలు తెలిపారు.మాజీ కౌన్సిలర్ నందిమల్ల. శారద అశోక్ శ్రీ చౌడేశ్వరి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నప్రసాద వితరణ చేశారు.ఆశ్రమ నిర్వాహకులు ఎస్.వెంకటేశ్వరమ్మ,రాము వృద్ధులు గతములో ఆశ్రమానికి రావుల చేయూత అందజేశారని వారు నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో ఉండాలనిఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో పలుస.రమేష్గౌడ్, వాకిటి.శ్రీధర్, నందిమల్ల. అశోక్,గంధం.బాలపీర్, గంధం. పరంజ్యోతి, విజయ్కుమార్, గులాంఖాదర్ఖాన్, పలుస.శంకర్గౌడ్,వేణురెడ్డి, నందిమల్ల.రమేష్,గంధం. నాగరాజు,నాగనమోని.మన్నెం, నీలస్వామి,గులాం ఖాదర్ ఖాన్, ఉంగ్లం.తిరుమల్, వెంకట్ సాగర్,జోహెబ్ హుస్సేన్, సూర్యవంశం.గిరి,అరీఫ్,సయ్యద్. జెమిల్, ఫజల్, సమద్,పాషా, ఎర్ర.శ్రీనివాసులు, కుమార్, శిరీవాటి.శంకర్,ఖాదర్,వెంకటేష్ తదితరులు ఉన్నారు.

## జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



**టీ మీడియా, జూన్ 10 పెబ్బేరు:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2026-2027 కు అడ్మిషన్లు ప్రారంభం అయ్యాయని ప్రిన్సిపల్ భద్రాసేన్ తెలిపారు అయన మాట్లాడుతూ ఎంపిసి బైపిసి సిఇసి యెచ్ఇసి కోర్సులు తెలుగు ఇంగ్లీష్ మీడియంలో ఉన్నాయనీ అన్నారు పుస్తకాలు యూనిఫోం టిఫిన్ భోజనం అన్ని వసతులు ప్రభుత్వం అందిస్తుందని నీట్ జెఈఈ కోచింగ్ డిజిటల్ క్లాసులు స్కాలర్ షిప్ సౌకర్యం వుందని 10 తరగతి పాస్ అయిన విద్యార్థులు జాయిన్ కావాలని కోరారు.

## అక్రమార్కుల చెరలో పట్టాభి రామయ్య భూమి

- **విడిపించాలని కోరుతున్న స్థానికులు**



**టి మీడియా, జూన్ 10, విజయవాడ :** ఎకరా 96 సెంట్లు భూమి, ధర రూ. 40 కోట్ల పైమాటే. ఇదీ విజయవాడ మల్లికార్జున పేటలోని పట్టాభి రామస్వామి వారి మాన్యం వివరాలు. అంత ఆస్తి ఉన్నప్పటికీ ధూపదీప నైవేద్యాల కోసం పట్టాభి రామయ్య దుర్గమ్మ మీద ఆధారపడాల్సి వస్తోంది. అందుకు కారణం దేవాదాయ శాఖ అధికారుల నిర్లక్ష్యం. పట్టాభి రామస్వామి భూమిని అక్రమార్కులు కబ్జా చేసి ఏళ్లు గడుస్తున్నా సరే అధికారులు వాటిని అక్రమార్కుల చెర నుంచి విడిపించలేదు. భూమిని రక్షించండి మహాప్రభో అంటూ సామాన్యులు మొత్తుకుంటున్నా మాకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారు.పట్టాభి రామస్వామి ఆలయం విజయవాడ ఇంద్రకీలాద్రి కొండపైనే మల్లికార్జున పేటలో ఉంది. కనకదుర్గమ్మ ఉప ఆలయంగా ఉన్న ఆలయానికి గొల్లపూడి బైపాస్ రోడ్డుకు సమీపంలో ఆర్?ఎస్ నెంబర్ 528/3లో 1.96 ఎకరాల భూమి ఉంది. 1946లో పినిశెట్టి వెంకమ్మ ఈ భూమిని దేవాలయానికి రాసిచ్చారు. భూమి విలువ ప్రస్తుతం రూ. 40 కోట్లపైనే ఉంది. దేవాదాయ శాఖకు చెందిన 43(10) సహా అన్ని రికార్డుల్లోనూ ఆలయం పేరుతోనే భూమి ఉంది. భూమిని గతంలో కౌలుకు ఇచ్చారు. ఆ తర్వాత దానిపై దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. దీన్ని అదునుగా చేసుకున్న ఆరుగురు అక్రమార్కులు రెవెన్యూ అధికారుల సహాయంతో అడంగల్‌లో పేర్లను ఎక్కించేసి రిజిస్ట్రేషన్ చేయించేసుకున్నారు.

**ఆరుగురి పేర్లపైన రిజిస్ట్రేషన్లు**

గొల్లపూడి రీ సర్వే నెంబర్ 528/3లోని ఈ భూమిని ఫసలీ నెంబర్ 1402, 1407, 1413లో మాన్యువల్ అడంగల్, వెబ్ అడంగల్‌లో అక్రమార్కులు తమ పేర్లపైకి మార్చేసుకున్నారు. ఫసలీ నెంబర్ల మేరకు 1992, 1997, 2003లో కబ్జాకు తెరలేపినట్లు తెలుస్తోంది. తర్వాత 2011లో ఆరుగురి పేర్లపైకి రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. భూ కబ్జాకు రికార్డులు మార్చడానికి 2011లో ప్రైవేటు వ్యక్తుల పేరుపైకి రిజిస్ట్రేషన్లు చేయడానికి సహకరించిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఆర్ఐ, సర్వేయర్ల పేర్లు ఇవ్వాలని తాజాగా సామాజిక కార్యకర్త గగ్గర కృష్ణారావు సమాచార హక్కు చట్టం ద్వారా కోరినా సరే ఫలితం లేకుండా పోయింది. అధికారుల పేర్లు ఇవ్వకుండా కేవలం మాన్యువల్ అడంగల్, వెబ్ ల్యాండ్ అడంగల్‌లో ఎప్పుడు మార్చారనేదే తెలిపారు. ఈ అక్రమానికి వెన్నుదన్నుగా ఉన్నవారిని కాపాడాలనే ప్రయత్నం ఇక్కడ స్పష్టంగా కనిపిస్తోంది.ప్రస్తుతం ఆలయ నిర్వహణ, ధూపదీప నైవేద్యాలకు దుర్గ గుడి నుంచి ఏటా లక్ష రూపాయలు ఇస్తున్నారు. అక్రమార్కుల చెర నుంచి భూమిని విడిపిస్తే ఆ పరిస్థితి ఉండదని స్థానికులు అంటున్నారు. భూ కబ్జా విషయం తెలిసినా దేవాదాయ శాఖ అధికారులు పట్టించుకోవట్లేదని ఆరోపిస్తున్నారు.

## భార్యను తుపాకీతో కాల్చి చంపిన భర్త



**టి మీడియా, జూన్ 10, హైదరాబాద్ బ్యూరో:** హైదరాబాద్ మల్కాజ్‌గిరి పరిధి మారుతినగర్‌లో దారుణం జరిగింది. స్థిరాస్తి వ్యాపారి కుమార్ తన రెండో భార్య నిషారాణిపై అనుమానంతో తుపాకీతో కాల్చి చంపాడు. కాల్పుల శబ్దాలు విని భయాందోళనకు గురైన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీలులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

**3 నెలల క్రితమే తుపాకీతో పట్టుబడ్డ కుమార్**

అయితే నిందితుడు 3 నెలల క్రితం వాహన తనిఖీల్లో తుపాకీతో పట్టుబడడంతో అంబర్?పేట పోలీసులు దానిని సీజ్ చేశారు. అయినా కూడా కుమార్ మరో తుపాకీ కొనుగోలు చేసి నిషారాణిపై ఈరోజు తెల్లవారుజామున 2 రౌండ్ల కాల్పులు జరిపి కిరాతకంగా హత్య చేశాడు. గతంలో కుమార్‌ను మొదటి భార్య వదిలి వెళ్లిపోవడంతో ఆమె చెల్లెలు నిషారాణిని ప్రేమ పెళ్లి చేసుకున్నాడని బంధువులు తెలిపారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



## జిల్లా విద్యా అభివృద్ధికి సహకరించాలి

**నూతన ఎఫ్.ఏ.సీ కోరిన ఎంఈఎఫ్ జిల్లా కమిటీ**

**టీ మీడియా, జూన్ 10, వనపర్తి బ్యూరో :** వనపర్తి జిల్లా నూతన ఎఫ్.ఏ.సీ జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) యాదయ్యాని బుధవారం మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎం.ఈ.ఎఫ్.) వనపర్తి జిల్లా కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎ.ఐ.ఎం.ఈ.ఎఫ్. ఉపాధ్యక్షులు గద్వాల కృష్ణ మాట్లాడుతూ, వనపర్తి జిల్లాలో విద్యా ప్రమాణాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, పాఠశాలలపై క్రమబద్ధమైన తనిఖీలు నిర్వహిస్తూ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని నూతన ఎఫ్.ఏ.సీ డీఈఓ యాదయ్యాని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో ఎస్.ఎల్.టి.ఏ జిల్లా ప్రధాన కార్యదర్శి జె. అమర్‌నాథ్, ఎం.ఈ.ఎఫ్. జిల్లా అధ్యక్షుడు బొరెల్లి వెంకటయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి, టి. శివిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## గంజాయిని అరికట్టడానికి ఈగల్ బృందం

- **పట్టణ ఎస్సై జె శ్రీధర్**

**టీ మీడియా, జూన్ 10, రామకృష్ణాపూర్:** క్యాతనపల్లి మున్సిపాలిటీ రామకృష్ణాపూర్ పరిధిలో పోలీసులు బుధవారం గంజాయి నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా పట్టణ ఎస్సై మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం వచ్చిన తర్వాత గంజాయిని పూర్తిగా అరికట్టడానికి ఈగల్ అనే ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిందని, గంజాయి రహిత సమాజం కోసం ఈ బృందం కృషి చేస్తుందని అన్నారు. అలాగే ఈ తనిఖీల్లో ప్రత్యేకంగా నార్కొటిక్ డాగ్ స్క్వాడ్ ను రంగంలోకి దించారు.ఈ డాగ్ స్క్వాడ్ సహాయంతో ఎక్కడైనా గంజాయి దాచి ఉంచితే సులభంగా పసిగట్ట వచ్చని అన్నారు.పట్టణ పరిధిలో ఎవరైనా గంజాయి తాగే అలవాటు ఉన్న,లేదా విక్రయించే అలవాటు ఉన్న తక్షణమే మానుకోవాలని.లేనిపక్షంలో చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజలకు తెలియజేయునది ఏమనగా మన ప్రాంతంలో ఎక్కడైనా గంజాయి విక్రయిస్తున్న లేదా సేవించడానికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి గంజాయి నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్సై ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో ప్రత్యేక పోలీసు బృందం,పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.